

SWEET MAGIC
BESANT ROAD CROSS
PRAKASAM ROAD
VIJAYAWADA-520 002
Ph. No: 5598686



# ఆమె ఎవరు?

నల్లబాటి రాఘవేంద్రరావు

''నువ్వు చచ్చిపోయావు...''

''నీ... ఇ...ష్టం...''

''చచ్చిపోయినవాళ్ళకు నోట్లోంచి మాటలు రావు. ఈ గోనెమూటలో పాత బట్టల మధ్య కూర్చో. మూతి కట్టేస్తాను. రెండు గంటలు ఓపిగ్గా ఉండు... గమ్యం చేరతాం. శ్వాస ఆడేలా ఏర్పాటు చేశాను. గత్తరైతే... నువ్వున్న ఈ గోనెమూట ... గోదార్లో ... తప్పదు...!''

★★★

''ఓబులేసూ ... ఆకాశం మబ్బుపట్టింది... వర్షం వస్తుందంటావా?''

''సూసిందంతా నిజం కానట్టే, మబ్బులన్నీ నిజం కాదండీ రామం మేట్టారూ...''

''బాగా చెప్పావు. పడవ త్వరగా పోనియ్...''

''జనం ఎవరైనా వత్తారేమో సూద్దా ఉండండి. మేట్టారూ... ఈ గోనెమూట ఏటండీ?''

''పాత బట్టలు - అమలాపురంలో మా పిన్నిగారిచ్చారు. ఇంటికి తీసుకెళ్తున్నాను.''

''అయితే దానిమీద కూకోండి...''

''సరేకాని, మనం కోటిపల్లి చేరడానికి ... ఎంతసేపు... ఆ వచ్చేదెవరు? .. మోటారుబండి మీద ఇలాగే... వస్తున్నట్టుంది.''

''ఆయన ఎస్సైగారండీ, ఒక్కోమాటు అర్జంటుగా ఈ దారంటే ఎల్తారండి. ఆయనకు పది, బండికి పది. ఇర్వై రూపాయలు నాకియ్యాల! రండి బాబుగారూ రండి, బండిని జాగత్తగా ... ఇట్టా... ఆ.. ఇట్టా ఎక్కించండి. ఆ.. మీరొచ్చెయ్యండి బాబూ... అద్గదీ... ఇట్టా ఈ గోనెమూట మీద కూకోండి తమరు...''

''ఫర్వాలేదు. మీరు... రామం మాష్టారు కదూ'' అడిగాడు ఎస్.ఐ. త్రిలోక్ రామం వైపు చూస్తూ.

''నమస్తే సార్... రామం మాష్టారినే నేను.... ఈ మూట .. పాత... బట్టలు...''

''కాస్సేపు దీనిమీద కూర్చోవచ్చా?''


''సార్, అంటే... అది.. అదికాదండీ, పాత బట్టల్లో సూదులవి ఉంటాయంటారు... అందుకని...''

''సరే, త్వరగానే వెళ్ళిపోతాం. పడవ నడపడంలో ఓబులేసు చాలా దిట్ట. నాకు తెలుసు. బైదిబై... మీ చదువులెలా ఉన్నాయి?''

''పెద్దోళ్ళ చదువులు కదండీ, వాళ్ళొస్తే చెప్తానండి... లేకపోతే ఖాళీ...''

''అరరే, ... మూట గోదార్లోకి దొర్లిపోయేలాగుంది...''

''మూట గోదార్లోకి పోకుండా పట్టుకున్నందుకు మీకు థాంక్స్ సార్!''



''ఇట్స్ ఓ.కె. చాలా బరువుందే... ఈ గోనెమూటలో... ఏమిటి?...''

''పాత... బట్టలే సార్, ఇందులో పెట్టే టప్పుడే కొంచెం తడిసిపోయాయి. దాంతో... మూట బరువుగా.. ఉంది...''

''మీ అమ్మగారు చనిపోయి చాన్నాళ్ళయ్యిందిగా. ఇంకా మీలో కంగారు, భయం, బాధ తగ్గినట్టు లేదు.''

''అమ్మ... కదా... సార్, అందుకని...'' కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు రామం.

''సారీ, అన్నట్టు నేనూ, గవర్నమెంటు డాక్టరుగారు ఇచ్చిన ఏక్సిడెంటల్ డెత్ రిపోర్ట్సుతో ఎమ్.ఆర్.ఓ. గారి ద్వారా ప్రయత్నించారట... లక్ష రూపాయల ఎక్స్ గ్రేషియా కలెక్టరు గారి ద్వారా మీకు అందినట్టు తెలిసింది. ఏం చేశారు ఆ డబ్బు....?''

''మా ఊర్లో పాత అప్పులు తీర్చేశాను సార్''.

''మీ ఊరునుండి, ఇప్పుడు మీరు ఉంటున్న పాతగూడెం వచ్చి ఎన్నేళ్ళయ్యుంటుందీ...''

''ఇంచుమించు 5 సంవత్సరాలయ్యింది సార్...''

''ఈ గూడెంలో మనుషులతో మీరు బాగానే నెట్టుకొస్తున్నారు. వీళ్ళు చాలా విచిత్రమైనవాళ్ళు, భయస్తులు, అమాయకులు... ఎలా పడుతున్నారో... గతంలో నేనూ... ఇలాంటి వ్యక్తులే ఉండే ఒక గ్రామంలో ఉద్యోగం చేశాను. వాళ్ళ ఇళ్ళల్లోనే ఒక ఇల్లు కాపురానికి ఇచ్చారు. ఇచ్చిన దగ్గర్నుంచి ఊరుకున్నారా... 30 ఏళ్ళ క్రితం ఆ ఇంట్లో మూడు హత్యలు జరిగాయట...! దాంతో వాళ్ళు దెయ్యాలు, పిశాచాలు అని కథలు కథలుగా చెప్పి భయపెడుతుండేవారు. మంత్రించిన బొండాలు, నిమ్మకాయలు, పటిక, బొగ్గుముక్కలు రోజూ నా ఇంటిచుట్టూ కట్టేవారు. ఆ దెయ్యం, పిశాచి బాధ ఎలా వున్నా వాళ్ళ బాధ పడలేక పరుగున ఈ ఊరొచ్చేశానన్నమాట. ఇక్కడ కూడా వీళ్ళతో పడలేనని పించి, ఇదిగో స్టేషన్‌లోనే ఓ పక్కగా కాపురం ఉంటున్నాను'' ఎస్.ఐ. గోదారిలా గలగలా నవ్వేశాడు... శవ గోదారమ్మ తనువుపై పులకించి సాగిపోతోంది. ఓబులేసు పడవ రాగంతో పరవశించిపోతున్నాడు... రామం మాత్రం గుండె దడతో నిమిషాలు లెక్కపెట్టుకుంటున్నాడు.

చనిపోయిన తల్లి గుర్తుతో బాధపడ్డ రామాన్ని నవ్వించాలని ఎస్.ఐ. చేసిన ప్రయత్నం ఫలించలేదు.

''ఇంతవరకు వీళ్ళవల్ల ఏ బాధా లేదుసార్'' అని మాత్రం అనగలిగాడు రామం.

''అవును.. మీరుంటున్న ఇంట్లో 8 ఏళ్ళక్రితం ఎవరో రెడ్డిగారు తన ఉంపుడుగత్తెతో ఉండేవారట. ఆవిడకోసమే ఈ గుడిసెల మధ్య ఈ చిన్న పెంకుటిల్లు కట్టించారట... చివరికి ఆవిడ అందులోనే ఉరిపోసుకుని చచ్చిపోయి... పిశాచమో, దెయ్యమో అయ్యిందట...

''ఊరుకోండి సార్, మీరు కూడా.... ఈరోజుల్లో పిశాచి, దెయ్యం ఏమిటి సార్...''



*గ్రౌండ్ కంట్రోల్‌రూంకి ఫోన్ వచ్చింది.*

*''సార్, విమానమొకటే వూగిపోతూ వుంది'' పైలెట్, కోపైలెట్‌లు గోడు వినిపించుకున్నారు.*

*''కాక్‌పిట్‌లో తాగొద్దని చెబితే వినిచావరూ....'' గొణుక్కున్నాడు గ్రౌండ్.*

''ధైర్యవంతులే...'' ఎస్.ఐ. త్రిలోక్ మెచ్చుకున్నాడు.

* * *

తెల్లవారింది.

రామం మాష్టారి ఇంటిముందు జనం మూగారు. ఆ ఇంటిచుట్టూ వున్న 50 గుడిసెల వాళ్ళూ... ఆశ్చర్యంతో ఏదో చెప్పుకుంటున్నారు.

''ఏమిటి.. మీరంతా...'' బైటికొచ్చి అడిగాడు రామం.

''అర్ధరాతిరి దాటాక మీ ఇంట్లోంచి 'మూలుగులు' ఇనపడినాయండి మేట్టారూ. మాకు సానా భయమేసినాది''.

''అలాంటిదేమీ లేదే... మీరు పొరబడుంటారు''.

''ఏరా బండీ, నువ్వినుకున్నావు కదా...''

''నేనినుకునే, మిమ్మల్నందర్నీ తీసుకొచ్చి మీకందరికీ ఇనిపించినా. మీరు ఇనుకున్నారు గందా...''

''సుబ్బులు, సంద్రన్న, సత్తిగాడు, ఈ కుంటోడు, ఆ పడవ ఓబులేసు... మేం అందరం ఇనుకున్నాం మేట్టారూ..''

''నా దగ్గర చిన్న టేపరికార్డర్ ఉంది. ఊరు నుండి వచ్చాను కదా... మనసు ప్రశాంతంగా ఉంటుందని పాటలు వేసుకుని పడుకున్నాను. స్విచ్ కట్టడం మరచిపోయుంటాను. అదేదో మీకు ఇంకోలా వినబడి ఉంటుంది. మా అమ్మ చనిపోయిన దగ్గర్నుంచీ ఈ ఇంట్లో ఉండేది నేనొక్కడినే కదా. మీకూ తెలుసు... 'మూలుగులు' ఎట్లా వినబడతాయి?!''

''రంద్రా మేట్టారు సెప్పింది నిజమే...''

''ఉండెహె... అప్పుడెప్పుడో 8 ఏళ్ల క్రితం 'రెడ్డిగారుంచుకుంది' ఉరేసుకు సచ్చినపుడు... మనకిలాంటి మూలుగులే ఇనబడ్డాయి. గేపకం తెచ్చుకోండి. ఆ పిల్ల దెయ్యంకాని ఇప్పుడు మేట్టారి మీద మోజుతో వచ్చిందేమో... ఏదైనా మనం మన మేట్టార్ని రచ్చించుకోవాల.

''అమాసనాడు కోడిపిల్లల్ని దిట్టి తీద్దాంలే... నడండి... నూటొక్క కన్నెకోడి పిల్లలు సంపాదించండి''.

వారం గడిచింది...

ఆ గూడెంవాళ్ళంతా స్టేషన్‌కెళ్ళి ఎస్.ఐ. గార్కి మేష్టారి ఇంటి దగ్గర రాత్రి తతంగమంతా చిత్రంగా చెప్పటం మొదలుపెట్టారు.

''ఎస్సైగారూ, నిజమండీ... 5 రోజులు మూలుగులు ఇనబడినాయండి. మేం పట్టించుకోనేదండి. ఆ తర్వాత ... నువ్వు సెప్పరా కుంటోడా...''

''రేతిరేల బైటకొచ్చినానండి. మాట్టారింటికాడ తెల్ల సీర కట్టుకొని తుమ్మసెట్టుకాడ ఓ ఆడది... రెడ్డిగారుంచుకున్నదానిలా ఉందండీ. మాట్టారంటే ఆ పిశాచికి ఇట్టమండీ. మాట్టారుగారి అమ్మగారు సచ్చిపోనారు గదండీ... ఇక అడ్డులేదని మా మాట్టారుకి లైనేత్తుందండీ. నాను సూచినానని కనిపెట్టి నెమ్మదిగా లోపలికెల్లిపోనాదండీ...''

''ఛీఛీ... దెయ్యాలూ, పిశాచులు లేవు. అయినా ఇన్నాళ్ళూ లేంది ఇప్పుడెలా వచ్చిందీ...?''

''ఆ తర్వాతేం జరిగిందో నువ్వు సెప్పరా ఓబులేసూ..''

''నువ్వూరుకోఎహె... సారూ, అది ఆల్లమ్మ దెయ్యమే అయ్యుంటుందండీ, మొన్న తెల్లారగట్లేల ఆ మేట్టారింటికాడ నుండి గోదారి గట్టుకెల్తుంటే ఆ ఇంటి మెట్లకింద కాలీ జాగాలో బుట్టలో రత్తం గుడ్డలు... సానా ఉన్నాయండీ. మన సుబ్బులుగాడికి సూపించినాను.. ఏరా..''

''నిజమండీ, మేట్టారి కిటికీ దగ్గర నాకీ మందు బిల్లల మచ్చురేకులు దొరికినాయండీ. నేనేరుకుంటే లోపల్నుంచి 'దగ్గు'... ధుంబు ... ధుంబు... అని ఇనబడినాదండీ... సూత్తే మేట్టారింటికి తాలం పెట్టి ఉంది. ఈ ఇసయమే ఓబులేసు గాడికి తీసికెల్లి ఇనిపించినా... ఏరా...''

''కరెట్టండీ, ఆ ఇంటిలో దెయ్యమైనా ఉండాలి, మడిసైనా ఉండాలి. మనందరం ... ఎల్లి... సూద్దాం రండి ఎస్సైగారూ...''

''నేను బాగా ఆలోచిస్తాను. కంగారుపడి మాష్టారు దగ్గర ఏమీ అనకండి. ఆయనకసలు ఇలాంటి నమ్మకాలు లేవు. ఇదంతా మీ అనుమానం అయి వుంటుంది. మీరందరూ కలసేకదా మాష్టారు తల్లి శవాన్ని శ్మశానానికి తీసుకెళ్ళి అంతిమక్రియలన్నీ పూర్తిచేశారు. మీలో ఆనాటి భయం ఏడ్పిస్తుంది వెళ్ళండి, నాలుగు రోజులు పోయాక రండి. ఈలోగా నేను ఎంక్వయిరీ చేస్తాను.

ఎస్.ఐ. త్రిలోక్ ఒక నెల క్రితం మూసేసిన పాత ఫైలు బీరువా నుండి బైటకు లాగి దుమ్ము

దులిపి చదవటం మొదలుపెట్టాడు.

* * *

''నమస్తే సార్, 5 రోజుల్నుండి మా అమ్మ కన బడటం లేదు సార్, వెతికివెతికి కంప్లైంటుతో మీ దగ్గరకొచ్చాను''

''మీరేం చేస్తుంటారు?'' ఎస్.ఐ. ఎఫ్.ఐ.ఆర్. చదివి అడిగాడు.

''నా పేరు రామం అండి. ఈ గూడెంలో అందరూ రామం మాష్టారు అంటారు. బొబ్బర్లంక నుండి 5 సంవత్సరాల క్రితమే ఈ పాతగూడెం వచ్చేశాను సార్. పెద్దవాళ్ళకి వాళ్ళ ఇంటరెస్టును బట్టి చదువు నేర్పుతుంటాను. వాళ్ళిచ్చిన తృణమో, ఫలమో తీసుకుంటుంటాను. మా అమ్మా, నేనే. నాకు పెళ్ళి కూడా కాలేదండి. రోజులు గడిచిపోతున్నాయి ఎలాగోలా.''

''మీ అమ్మగారితో మీకేదయినా గొడవైందా?''

''అలాంటిదేం లేదుసార్, పైగా ఆవిడంటే నాకు ప్రాణం! ప్రజల్లో కూడా నాకూ, మా అమ్మకూ విరోధుల్లేరు...''

''ఆవిడకేమైనా దీర్ఘవ్యాధులు...''

''నో సార్, వయసు 90 అయినా ఏ తెగులూ లేదావిడకు, మామూలు బి.పి., షుగర్ తప్పించి.''

''సోc... హత్య, ఆత్మహత్య జరిగే అవకాశాలు లేవు. నేను పిలిచినప్పుడు రండి. ఈలోగా ఎంక్వ యిరీ పెడతాను... వెళ్ళండి.''

''వారం తర్వాత ఎస్.ఐ. గారినుండి కబురం దుకున్న రామం ఊరి చివర లాకుల దగ్గర దొరికిన శవం చూడ్డానికెళ్ళాడు. బాగా పరిశీలించి తన తల్లి కాదన్నాడు. కాస్సేపటికి 'ఆవిడ' పక్కూరి మరి యమ్మ అని తేలింది.

మరో వారానికి, మళ్ళీ కబురొచ్చింది రామా నికి. పాత పెద్దోళ్ళ నుయ్యినుండి ముసలి శవాన్ని అతికష్టంమీద పైకిలాగారు. అసలు తన తల్లికి, ఆ శవానికి పోలిక లేదన్నాడు. ఆ శవం వివరాలు కూడా వెంటనే లభ్యం అయిపోయాయి.

మరోసారి మళ్ళీ వచ్చిన కబురుతో.. అడ్డతోవ కొండవాలు వెళ్ళాడు రామం. అప్పటికే అక్కడ పోలీసులు... జనం! శవం బాగా ఉబ్బి, పాడైపో యుంది. దూరాన్నుంచే శవాన్ని చూసి ఏడ్చేవాడు రామం. ఆ బట్టలు తన తల్లివే అని, ఆవిడకు సన్నంచు ఎర్రచీరంటే ప్రాణమని అదే ఆఖరున కట్టిన చీర అని, చెవికి రాగిపోగులు, ముక్కుకు చిన్న ఇత్తడి నత్తి. తలలో పేలుకొరుకుడు మచ్చ! మెడలో ఎర్రపూసల దండ... ఈ శవం తన తల్లే అని ఆనవాళ్ళు అన్నీ కరెక్టుగా చెప్పి బాధ భరించ లేక తల్లి శవంపై పడి ఊగిపోతూ ఏడ్చాడు రామం.

''నా తల్లే బాబోయ్... అమ్మా... ఎలా చచ్చి పోయావమ్మా... ఎప్పుడు చచ్చిపో యావు.... అమ్మా, అమ్మా, అమ్మా...'' అంటూ రామం గోల పెట్టాడు. క్రిందపడి దొర్లాడు. గూడెం జనం అంతా ఓదా ర్చారు. ఎస్.ఐ. త్రిలోక్ రామం తల్లి శవానికి పోస్టు మార్టం నిర్వహించి రామానికి అప్పగిం చాడు.

రామం అందరి సహకారంతో శవాన్ని శ్మశానానికి వైభ వంగా తీసుకెళ్ళి సమాధి చేశాడు. ఆ సమాధిపై పడి గగ్గోలు పెట్టాడు. ఆ మట్టి తన శరీరానికి రాసుకుని పిచ్చివా డులా గెంతులేశాడు. అతని బాధ చూసి జనం... వాళ్ళూ ఏడ్చారు.

వారం వరకు రామం ప్రతిరోజూ ఆ సమాధి దగ్గరే గడిపేవాడు. తల్లితో మాట్లాడుతు న్నట్టు తనలో తాను ఏదేదో చెప్పుకునేవాడు. గూడెంలో వాళ్ళు ఎవరో ఒకరు రామాన్ని బలవం తంగా ఇంటికి తీసుకొచ్చేవారు .. తమ ఇంటి దగ్గ ర్నుండి గిన్నెతో అన్నం, కూర తెచ్చి బలవంతంగా పెట్టేవారు.

ఒకసారి ఎస్.ఐ. త్రిలోక్ అటుగా వస్తూ



## రాఖి ఛానెల్ గొడవ

ఈమధ్య ఒక టి.వి. ఛానెల్ తన ప్రోగ్రాంలో వేశ్యావృత్తిలో వున్న అమ్మాయిలను ఇంటర్వ్యూ చేస్తూ రాఖిసావంత్ పోలికలతో ఒక అమ్మా యిని మసక మసగ్గా చూపించింది. దాంతో ఇండస్ట్రీ అంతా టి.విలో కని పించింది రాఖీసావంత్ అని పుకారు బయలుదేరింది. మ్యూజిక్ విడి యోలు, సినిమాల్లో ఇప్పుడిప్పుడే పేరు తెచ్చుకుంటున్న రాఖి అగ్గిమీద గుగ్గిలంగా మారి ఆ ఛానెల్‌ని శాపనార్థాలు పెడుతూ వుంది. పబ్లిసిటీ కోసం మరీ ఇంత చీప్ ట్రిక్స్ పనికిరావని దుమ్మెత్తి పోస్తోంది. ఆ ఛానెల్ వాళ్ళు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వున్నారు. తమ ప్రోగ్రాంలో ఎక్కడా రాఖి పేరెత్తలేదని వారి ధీమా. కాని జనాన్ని తప్పుదోవ మటుకు పట్టించారు.



రామాన్ని అనునయించి శ్మశానం నుండి తీసుకొచ్చి ధైర్యం నూరిపోసి పోస్టుమార్టం రిపోర్టులను బట్టి హత్య, ఆత్మహత్య కాదని కొండమీద బండరాయి జారి ఆ ముసలావిడ మీద పడడం వలన ప్రమాద వశాత్తు జరిగిన మరణం కనుక ఫైలు మూసేస్తున్నట్టు చెప్పి... ''అసలావిడ కొండమీదకు వెళ్ళవలసిన అవసరం ఏమిటి?'' అని ప్రశ్నించాడు.

'పసర ఆకులకోసం అడ్డదారిగుండా ఆమె అప్పుడప్పుడు కొండ ఎక్కుతుంటుందని... తాను అక్కడ మాత్రం వెతకలేదని' చెప్పడంతో ఎస్.ఐ. తృప్తిపడ్డాడు.

''మిస్టర్ రామం... ఇటువంటి మరణాలకి ప్రభుత్వం తరపు నుండి లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు ప్రయత్నించండి... నా సహకారం ఎప్పుడూ మీకుంటుంది'' అంటూ 'షేక్‌హేండ్' ఇచ్చి రామాన్ని ఇంటికి పంపించాడు ఎస్.ఐ. త్రిలోక్.

పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ఫైలు మూసేసి... దుమ్ము మళ్ళీ దులిపి... బీరువాలో పెట్టాడు ఎస్.ఐ. త్రిలోక్. సిగరెట్ తాగుతూ ఫైబర్ ఛైర్‌లో జారపడి ఆలోచనలలో పడ్డ ఆయనకి ఆ గూడెం ప్రజలు చెప్పిందంతా నిజమేనేమో అనిపిస్తుంది!

అసలు... ఆరోజు... పడవలో రామం కంగారు పడుతూ... తెచ్చిన 'గోనె మూట...!?'

* * *

రాత్రి ఒంటిగంట.

గొళ్ళెం కొట్టిన శబ్దం కావడంతో రామం తలుపు తీశాడు. ఎదురుగా ఎస్.ఐ. త్రిలోక్!

''సార్, ఇంతరాత్రి మీరు..?''

''రావలసొచ్చింది.. ఒక సారి మీ ఇల్లంతా సోదా చేయాలి.''

''గిట్టని వాళ్ళు ఏదో చెప్పారని మీరు కూడా...''

''మీ మీద నాకు నమ్మకం ఉంది. ఆ నమ్మకాన్ని గూడెం అందరూ నమ్మాలిగా'' ఎస్.ఐ. త్రిలోక్ ఇల్లంతా కలియతిరిగాడు.

''ఆ.. మంచం..?''

''అది మా అమ్మ పడుకునుండే నులకమంచం సార్..''

''అదే. దాని దగ్గర సగంతిన్న ఫ్రెష్ రొట్టె... మందులు..''

''నేనే ఆ రొట్టె తిని వదిలేశాను సార్, అమ్మ జ్ఞాపకార్థం మిగిలినవన్నీ అలాగే ఉంచేశాను. మంచంక్రింద చూస్తారా, పైకెత్తమంటారా?''

''వద్దు..' ఎస్.ఐ. త్రిలోక్ అక్కడున్న స్టూలెక్కి అటకంతా బేట్రీ లైటుతో పరిశీలించాడు.

''సారీ ఫర్ ద ట్రబుల్..'' అనుకుంటూ ఎస్.ఐ. బైటకొచ్చేశాడు. రామం మౌనంగా నిలబడిపోయాడు.

ఏదో గుర్తొచ్చిన వాడిలా ఎస్.ఐ. అక్కడే వున్న బీరపాదు క్రింద గోనెమూట దగ్గరకొచ్చాడు.

రామం కంగారుపడ్డాడు.

ఎస్.ఐ. త్రిలోక్ మూతి విప్పి గోనెమూట తిరగబెట్టాడు. అన్నీ పాతబట్టలే! 'షిట్' అనుకుంటూ స్పీడుగా వెళ్ళిపోయాడు.

మళ్ళీ పదిరోజులు.. ఆ ఇంట్లోంచి శబ్దాలు.. దగ్గు, మూలుగు.. డిటో! తుమ్మచెట్టు క్రింద రాత్రి తెల్లచీర మనిషి, మెట్లక్రింద బట్టల్లో రక్తం గుడ్డలు! వాడేసిన టాబ్లెట్ షీట్స్!! డిటోడిటో! చాలామంది గూడెంవాళ్ళు భయపడి రామం ఇంటికి దూరంగా వెళ్ళిపోయి కాపురాలు పెట్టుకున్నారు.

మళ్ళీ ఒకరోజు తెల్లవారకుండా వచ్చి కాస్సేపు అంతా గమనించి బూటుకాలితో తలుపు తన్ని శబ్దం చేశాడు ఎస్.ఐ. త్రిలోక్.

రామం తలుపుతీసి మళ్ళీ ఆశ్చర్యపడ్డాడు.

''ఈ ఇంట్లోంచి 5 నిమిషాల ముందు దగ్గు, మూలుగు స్వయంగా నేనే విన్నాను. రామం నీ మీద గౌరవం పోయింది. ఇక్కడేదో జరుగుతుంది. నువ్వు దోషివైతే చట్టం చక్రంలోనుండి తప్పించుకోలేవు'' స్పీడుగా ఇల్లంతా పరిశీలించాడు ఎస్.ఐ. త్రిలోక్.

''సార్, స్టూలు వెయ్యమంటారా... అటక మీద చూస్తారా...'' స్టూలు వెయ్యబోయాడు రామం.

'వద్దు...' మంచం మీద దుప్పటి లాగి మంచం పైకెత్తాడు ఎస్.ఐ. త్రిలోక్!

మంచంక్రింద పెద్ద సిమెంటు పలకల గొయ్యి!

''ఏమిటిది? వ్వాట్...?'' కేకలు పెట్టినట్టు అడిగాడు.

''మా అమ్మ వెచ్చగా ఉండటంకోసం మంచం క్రింద చిన్న అగ్గిసెగ పెట్టుకొని పడుకునేది సార్, అదలాగే ఉండిపోయింది.''

ఎస్.ఐ. 'క్లూ' దొరకనందుకు రామం వంక కోపంగా చూస్తూ బైట బీరపాదు దగ్గరకొచ్చి బూటు కాలితో గోనెమూటను తన్ని వెళ్ళిపోయాడు.

మరో వారం గడిచింది అదే పరిస్థితిలో...

ఒకరోజు అర్ధరాత్రి దాటాక... కాగడాలతో గూడెం జనం మొత్తం రామం ఇంటిని చుట్టుముట్టారు. అలికిడికి నిద్రలేచి కంగారుపడి బైటకొచ్చాడు రామం.

''రామం మేట్టారూ.. మేం అందరం ఇక్కడే ఉన్నాం. ఈ ఇంట్లో 'ఎవరో ఉన్న సంగతి' ఇయ్యాల తేలిపోవాల. బైటకు తీసుకురండి మర్యాదగా...'' జనం గోలగోలగా అరిచారు.

రామం సహనంతో పక్కకు వెళ్ళి నిలబడ్డాడు.

వచ్చిన జనం ఇల్లంతా పరికించి ఏ ఆనవాలూ దొరకనందుకు సిగ్గుపడి తలలు వంచుకుంటూ ఎవరిదారిన వారు వెళ్ళిపోయాడు. ఓబులేసు మాత్రం అనుమానం వచ్చి మరో ఇద్దరితో బీరపాదు సమీపించి దానిక్రింద ఉన్న పాతబట్టల గోనెమూట బైటకు లాగి బట్టలన్నీ క్రిందపోసి మాష్టారు వైపు అనుమానంగా చూస్తూ వెళ్ళిపోయాడు.

మరోనెల గడిచింది.

రామం విషయం అందరూ వదిలేశారు. అతనికి దగ్గరలో దాదాపు ఎవరూ కాపురాలు లేరు. రామం వాళ్ళందరూ ఉండే చిన్న సందుకు వెళ్ళి అక్కడున్న రాములోరి గుడి అరుగుమీదే వచ్చిన వాళ్ళకే పాఠాలు చెప్పి ఇంటికొస్తుండేవాడు. ఏదో వండుకొని తిని పడుకునేవాడు. ఎస్.ఐ. త్రిలోక్ రామం మీద ఒక కన్నేసి ఉంచాడు.

ఆరాత్రి... 3 గంటల సమయం...

చెంబుతో కూర్చోడానికి బైటకొచ్చిన ఓబులేసు దూరంగా పొలం గట్టుమీద గోనెమూట కదలివెళ్తున్న విషయం కనిపెట్టాడు. భయపడి తన పని వాయిదా వేసి కంగారులో నీళ్ళు కూడా పారబోసుకున్నాడు. ఎవరో మనిషి ఆ మూటను అనుస

రిస్తూ... చెట్టు పుల్లలు ఇరుస్తున్నట్టు నటిస్తూ... మధ్యమధ్యలో మూటను తరలిస్తూ అలాఅలా చాలాదూరం సాగిపోతున్నాడు... గోనెమూటతో సహా. చిత్రమైన సంఘటన, భయంకర అనుభూతి చీకట్లో! అయినా తన గూడెంలో తను భయపడవలసిన పనేమిటి అన్నట్టు మనసు రాయిచేసుకుని నిలదొక్కుకున్నాడు... ఈ మూట 2 నెలల క్రితం తన పడవలో... రామం మేష్టారు.. మళ్ళీ బీరపాదు క్రింద.. అదే ఇది!!... ఓబులేసుకి ధైర్యం వచ్చింది.

పరుగున వెళ్ళి కుంటోడుని తీసుకొచ్చి... దూరంనుండి ఆ ఘట్టం చూపించాడు. మళ్ళీ కుంటోడిని పంపి బండిగాడిని, సబ్బులు, సంద్రన్న, సత్తిగాడుని, ఇంకా ఓ 50 మందిని ఆడా మగాని పోగుపెట్టాడు.

ఆ గోనెమూట అలా అలా రావిచెట్టు దాటి, పుంతలో ముసలమ్మ గుడి దాటి, పిల్లకాలువ వారగా వెళ్తుంది... ఆ మూటని అనుసరిస్తూ ... ఆ మనిషి...!

ఈలోగా ఎవరో వెళ్ళి ఎస్.ఐ. త్రిలోక్‌ని తీసుకొచ్చారు. దూరంగా మోటారు బండి పెట్టి పరుగున వచ్చిన ఎస్.ఐ. ఆ మూటని, మనిషిని.... దూరం నుంచి అనుసరిస్తూ వెళ్తున్నాడు... అతని వెనుకగా అలికిడి చేయకుండా గూడెం జనం!

"ఎస్సైగారూ, ఆ మడిసి రామం మేట్టారేండి, ఆ ఏల నా పడవలోంచి అతను పట్టుకెల్లిన గోనె మూట ఇదేనండీ..."

"ఉష్.. కనిపెట్టాను. గట్టిగా మాట్లాడకండి. పందుం పుల్లలు కోస్తున్నట్టు నటిస్తూ ఆ మూటను ఎక్కడకో చేరుస్తున్నాడు".

"నాను దెయ్యమేమోనని కంగారుపడ్డానురా సుబ్బులూ..."

"నోర్ముయ్యరా, నువ్వే సీకట్లో దెయ్యంలాగుంటావు. తారుడబ్బా ముఖం ఎదవా... మాటాడకుండరా..."

"ఎస్సైగోరో, ఆ రెడ్డిగారుంచుకున్నావిడ పిశాచికి ఈ గోనెమూటకి లింకుందంటారా?"

"అన్నీ తెలుస్తాయి... మాట్లాడకుండా ఉండండి.. నాతో రండి..."

"ఎస్సైగారూ... ఈ దారంట గూడెం దాటాలంటే నా పడవ ఎక్కితీరాలి కదా. మరి ఈ మేట్టారు ఏడకి పోతున్నట్టు?"

"అతనెళ్ళేది ... శ్మశానానికి...!"

"ఈడి ముఖంమండ... ఇంత రాతిరేళ... శ్మశానానికా...!"

"ఓలమ్మో... నా కాల్లు రెండూ తడిసిపోయినట్టున్నాయేంటి?"

"అదో జబ్బురా నీకు. ఒరే... కుంటోడా నీ కాల్లెప్పుడూ అంతే. నోర్మూసుకొని రా..."

ఆ మూట పెద్దవంతెన దాటి, కుక్కలగట్టు చేరి శ్మశానానికి చేరువగా చేరుకుంది. ఎస్.ఐ. త్రిలోక్ ఇప్పుడేం జరుగుతుంది? ఏం చేయాలి అన్నదాని గురించి ఆలోచిస్తున్నాడు.

"ఒరే, కుంటోడా ఆ మూటలో ఏముందంటావ్?"

"ఆడికేం తెలుసు పడవ తెడ్డు. నేసెబుతా. నా పడవమీదే అట్టుకొచ్చారు మాట్టారు. దానిలో పాత బట్టలు ఉండాయి. మొన్న మేట్టారు ఇంటికాడ కూడా సూసాం కదా."

"పాతబట్టలా మరి ఈడకెందుకు తెచ్చినాడు ఇంతకట్టపడి."

"కప్పుకొని పడుకోడానికి, సూత్తా ఉండెహే.."

చిన్నగా వర్షం ప్రారంభమైంది. శ్మశానంలోకి వెళ్ళిపోయాడు రామం ఆ గోనెమూటతో! అంతకు ముందే అక్కడ పెట్టుకున్న గునపంతో తవ్వాడు. నేల మెత్తగా ఉన్నమూలాన 5 నిమిషాల్లో గొయ్యి ఏర్పడిపోయింది.

ఆకాశంలో మెరుపులు... మర్రిచెట్టు తొర్రలో వెచ్చదనంకోసం కూర్చున్న నక్క అరుపులు... కీచురాళ్ళ పిచ్చిధ్వనులు... కప్పలు బెకబెకలు. దూరంగా పిడుగుపడిన శబ్దం.

శ్మశానం మర్రిచెట్టు చేరువలో నిలబడి మెరుపుల కాంతిలో రామం చర్యలు మొత్తంగా గమనిస్తున్న గూడెం జనం... ఒకర్నొకరు భయంతో పట్టేసుకున్నారు. ఎస్.ఐ. గారు తోడున్నారు కదా అని

**చిన్నగా వర్షం ప్రారంభమైంది. శ్మశానంలోకి వెళ్ళిపోయాడు రామం ఆ గోనెమూటతో! అంతకుముందే అక్కడ పెట్టుకున్న గునపంతో తవ్వాడు. నేల మెత్తగా ఉన్నమూలాన 5 నిమిషాల్లో గొయ్యి ఏర్పడిపోయింది. ఆకాశంలో మెరుపులు... మర్రిచెట్టు తొర్రలో వెచ్చదనంకోసం కూర్చున్న నక్క అరుపులు... కీచురాళ్ళ పిచ్చిధ్వనులు...**

లోలోపల వాళ్ళందరికీ భయం! కొండంత ధైర్యం!!

ఆ గొయ్యిలో మూటని పెట్టబోయాడు రామం!

ఎస్.ఐ. ఒక్కడుగులో అతడిని చేరి మూట పట్టుకొని ముడి విప్పుతున్నాడు.

ఆ మరుక్షణం నోట మాటరాక శవంలా ఉండిపోయాడు.

జనం చుట్టూ చేరారు.

"రామం నువ్వు దొరికిపోయావు. ఈ గోనె మూటలో ఏమిటి?" బేట్రీ లైటుతో చూడబోయాడు.

"మా అమ్మ 'శవం' సార్... ఈ అర్ధరాత్రే చచ్చిపోయింది!!" భయంతో, ఏడుస్తూ చెప్పాడు రామం.

అందరూ ఆశ్చర్యపోయారు!

"ఎంత నాటకం! ఎంత నాటకం... ఇన్నాళ్ళూ వీళ్ళంతా చెప్పేది నిజమన్నమాట! మీ అమ్మ నీ ఇంట్లోనే ఉందా... మరి నే వచ్చినప్పుడు...?"

"మంచంక్రింద చూసుకుంటారా అన్నాను సార్, మీరు 'వద్దు' అని అటకమీద చూశారు. అప్పుడు మా అమ్మ నిజంగా మంచంక్రిందే ఉంది సార్! మరోసారి వచ్చినప్పుడు అటకమీద చూస్తారా అన్నాను. మీరు 'వద్దు' అని మంచం క్రింద చూశారు. అప్పుడు మా అమ్మ నిజంగా అటకమీదే ఉంది సార్!"

"మరి గూడెం జనం వచ్చి వెతికినప్పుడు....?"

"వాళ్ళు బాత్రూం చూళ్లేదు సార్! మా అమ్మ అప్పుడు అందులో ఉంది."

"మోసం చేస్తావ్... బ్రతికున్న తల్లిని చచ్చినట్టు ఎందుకు చేశావ్?"

"గవర్నమెంటు ఇచ్చే లక్ష రూపాయల కోసమే... క్షమించండి సార్..."

"లక్ష రూపాయలకోసం పెద్ద డ్రామా కట్టావు. వెరీగుడ్, వెరీగుడ్... అంటే మీ అమ్మను ఏదో ఊర్లో దాచేసి... ఏదో శవాన్ని దొంగ ఆనవాళ్ళతో మీ 'అమ్మశవంగా' ప్లే చేసి మమ్మల్ని వంచించావు. గోనెమూటతో ఆనక పడవమీద మీ అమ్మను తెచ్చి ... మాకనుమానం రాకుండా అదే గోనెమూటలో మళ్ళీ పాతబట్టలు కుక్కి బీరపాదు కథ ఆడిస్తావ్!? అమ్మ... అమ్మ.. యూ.. రోగ్... సినిమాలు, టి.విలు చూసి నీలాంటివాళ్ళు చాలామంది ఇలాంటి ట్రిక్కు చేస్తున్నారు. ఎప్పటికైనా చట్టానికి దొరక్క తప్పదు.... అని తెలిసీ గారడి చేస్తావ్... బురిడీ కొట్టిస్తావ్..."

గూడెం జనం అంతా తెల్లబోయిన ముఖాల్తో గుండె కొట్టుకోవడం ఆగిపోయినవాళ్ళలా ఉండి ...చూస్తూ... వింటున్నారు.

"సార్, నేనేం తప్పు చేయలేదు సార్, ఇప్పుడు మా అమ్మను కూడా నేను చంపలేదు సార్. ఆవిడే చచ్చిపోయింది" రామం ఎస్.ఐ. త్రిలోక్ కాళ్ళపై పడబోయాడు.

"ఆగు.. దొరికేవరకు ప్రతివాడూ దొరే!! నువ్వు చంపేవో లేదో పోస్టుమార్టమ్ రిపోర్టు చెప్తుంది."

"అయినా తెలుసుండీ నీ తల్లిది కాని శవాన్ని, నీ నిజం తల్లి శవంగా చెప్పటం... మోసంతో లక్ష రూపాయలు కాజెయ్యటం... నీ బ్రతికున్న తల్లికి స్వేచ్ఛలేకుండా బంధిఖానాలాంటి జీవితం చూపించటం... ప్రజల్ని, అధికారులను బోల్తా కొట్టించటం... ఇవన్నీ నేరాలే... నడు... స్టేషన్‌కి.." ఎస్.ఐ. త్రిలోక్ రామాన్ని మెడపట్టి గెంటాడు.

* * *

స్టేషన్‌లో రామం నేరాల ఫైలు తయారు చేస్తూ... వేడి టీ తాగుతూ.. ఏదో ఆలోచనలో పడ్డాడు ఎస్.ఐ.

జవాబులేని ప్రశ్నలా అతన్ని ఒక ప్రశ్న వేదించుకుతినేస్తుంది.

అదే... అసలు... 'ఆమె ఎవరు?!'

రామం తల్లిగా 3 నెలల క్రితం రామంచేత అంతిమ సంస్కారాలు పొందిన ... 'ఆమె ... ఎవరు?!'

హిమాలయాల్లో అగ్నిపర్వతం పుట్టి... అది అగ్నిగోళాలను వెదజల్లుతున్నంత ప్రశ్న... "ఆమె .. ఎవరు?!"!!!

★